

# ప్రేమవసంతం

యలమర్తి అనూరాధ

# **ప్రేమ వసంతం** (నవల)


రచన : **యలమర్తి అనూరాధ**

ప్రథమ ముద్రణ : జూన్, 2015

కాపీలు : 500

హక్కులు : రచయిత్రివి

వెల : **రూ. 150/-**

ప్రతులకు : **యలమర్తి అనూరాధ**
బ్యాంక్ కాలనీ, క్వార్టర్ నెం–13
తణుకు – 534 211, ప.గో.జిల్లా.
సెల్ : 92472 60206
email : anuradha.yalamarthy@gmail.com

ముఖచిత్రం : **బాలి**

ముద్రణ : **శ్రీ భగవాన్ ప్రింటర్స్**
సూర్యారావుపేట, విజయవాడ–2
సెల్ : 94407 82996

# "ప్రేమ వసంతం"

సాయం సమయం. ప్రేమికుల హృదయాలను పూర్తిగా క్రమ్మేసే ప్రేమలా మేఘాలు ఆకాశాన్ని అమాంతం చుట్టేస్తున్నాయి. అందులో ఉక్కిరి బిక్కిరవుతూ ఆనందాన్ని చినుకుల రూపంలో పాటను కూని రాగంలా ప్రారంభించి ఒక్కసారి నెమ్మదిగా శృతి పెంచి 'వాన' గీతం ఆలపించటం మొదలు పెట్టింది. ఇదంతా గమనిస్తున్న ఆమెకు అతడు తోడయ్యాడు. తలుపులన్నీ బంధించినా మమ్మల్నెవరూ ఆపలేరు అంటూ చిరుజల్లు వారి మీద అక్షింతల్లా పడి ఆశీర్వదించి వెళ్ళింది.

"వసూ! లోపలికి వెళ్దాం పదా! తడిస్తే జలుబు చేస్తుంది" అంటున్న అతని మాటలలోని లాలనకు ఆమె వెన్నలా కరుగుతూనే ఉంటుంది.

"అనూ! ఎన్నాళ్లయినా నామీద నీ ప్రేమ తరగదే!"

ఆమె మాటలను వింటూ మురిపెంగా, ఆపేక్షగా, కొంటెగా చూస్తున్న 'అనురాగ్' చూపులకు కొత్త పెళ్ళి కూతురిలా సిగ్గు పడింది 'వసంత'. నిజంగా పెళ్ళి కూతురప్పుడు కూడా అంతలా సిగ్గుపడలేదేమో!

"వసూ! ప్రేమ అదో తరగని గని. ఎంత తవ్వితే అంత వస్తూనే ఉంటుంది. అలాగే నీమీద నాప్రేమ కూడా. తెలిసి కూడా నాచేత చెప్పించు కోవాలని చూస్తావే!"

"ముప్ఫై సంవత్సరాలుగా నిన్ను చూస్తున్నా మళ్ళీ మళ్ళీ అనుభవించే వింత అనుభూతి. అందులోనే నాకు ఆనందముంది. అవునూ! మన మాటలు ఎవరయినా వింటే ఏమనుకుంటారు?"అంది అతనిలో ఒదుగుతూ.

"కొత్త జంట అనుకుంటారు. నిజంగా మనం అలా లేమా? అరవై దాటితే మళ్ళీ పునర్జన్మ క్రిందే లెక్కట. అంటే మనం కొత్త దంపతులమే! విచిత్రమేమిటంటే అరవై తరువాత కాదు పెళ్ళి అయిన దగ్గర నుంచీ మనం నిత్య ప్రేమికులమే అంటే ఎవరూ ఒప్పుకోరేమో! అయినా వాళ్ళ సంగతి, వీళ్ళ సంగతి మన కెందుకు? అటు చూడు! గాలికి వర్షం అలలులాగా ఎలా ఎగురుతోందో? ఆ తరంగాలలో గతంలోకి ఒక్కసారి తొంగి చూద్దామా?" అన్నాడు అనురాగ్.

"ప్రేమంటే అరక్షణంలో కలిగే ఆకర్షణ అని
దాని విలువ కొందరికి గంటలు
మరి కొందరికి రోజులు
ఇంకొందరికి కొన్ని సంవత్సరాలు

కానీ తనకూ అనురాగ్‌కి మాత్రం అనునిత్యం నవ వసంతమే". తన ఊహకు తనే నవ్వుకుంటూ 'అలాగే' అని అంగీకార సూచకంగా తల ఊపింది వసంత. వారి కళ్ళముందు దాంపత్య బంధం జీవిత చక్రంలా తిరగటం ప్రారంభించింది.

* * *

పంచరంగుల్లో ఆకాశం కన్నె పిల్లలా కవ్విస్తోంది. కవ్వించే కొద్దీ ఎరుపెక్కే అమ్మాయి బుగ్గల్లో భావాలకు ప్రతిబింబంలా ఆ రంగుల ప్రయాణం.. ఎన్నో హృదయాలు ఆ దృశ్యాన్ని ఎక్కడి నుంచో వీక్షిస్తున్నాయి. ఆ వింతను ఒళ్ళంతా కళ్ళు చేసుకొని చూస్తోంది వసంత. ప్రకృతికి పరవశించటం అందులో లీనమైపోవటం, పరిసరాలు మరచిపోవటం ఆమె అంతరంగం అయితే సంవత్సరానికి ప్రకృతికి ఒక **వసంతమే.** కానీ మా తల్లి జీవితంలో నిత్యం వసంతం ఉండాలని ఆరాటంతో అపురూపంగా ఆ పేరు ఆమెకు పెట్టారు గాంధీ, అరుంధతీ! అలాగే అల్లారు ముద్దుగా పెంచారు. కనీసం ఇద్దరైనా ఉంటే ఒకరికి ఒకరు తోడుగా ఉంటారనుకున్న వారి ఆశను అడియాశ చేస్తూ మళ్ళీ అరుంధతికి పిల్లలు పుట్టలేదు. ఒకర్తే పిల్లని గారాబం ఎక్కువ చేస్తే ఎక్కడ చెడిపోతుందో అనే భయం... ప్రేమిస్తూ... దండిస్తూ... ఆదర్శాలకు అనుగుణంగా తమ బిడ్డ ఈ లోకంలో మంచి పేరు తెచ్చుకోవాలి అన్న తపనే తల్లితండ్రులైన వారిలో ఆరాటం రూపంలో కనిపిస్తుంది.

గాంధీ తండ్రి 'దశరథ రామయ్య' ఆదర్శాలకు ఎంతో విలువ ఇచ్చేవారు. బయటవారి కోసం చిలుకపలుకులుగా ఆశయాలను వల్లించే వారికి విరుద్ధంగా తానాచరించి చూపేవారు. అందుకే తన కొడుకుకు 'గాంధీ' అని పేరు కూడా పెట్టుకున్నారు. అతనిలో మెదిలే ఆలోచనలకు అంకురం 'గాంధీ' అని ఆయన ఖచ్చితమైన అభిప్రాయం. ఇప్పటికీ ఆయన లేకున్నా ఆయన కోరికలకు అనుగుణంగానే అతను జీవిస్తున్నాడు. అదృష్టమేమంటే అరుంధతి అతనికి భార్యకావటం. పూజలు, వ్రతాలు, పాతివ్రత్యం పాలు ఎక్కువ అన్నది తప్ప మరే లోపం కాగడా పెట్టి వెతికినా కనిపించదు. ఇది శృతి మించినప్పుడు మాత్రం చాదస్తం క్రింద కనిపించి

విసుక్కుంటాడు కానీ అది వారి దాంపత్య జీవనంలో ఏరోజూ అవరోధం కాలేదు. ఒక మగ బిడ్డను దత్తత తీసుకుందామా అనే ఆలోచనకు మొదట్లోనే ఫుల్‌స్టాప్ పెట్టేసుకున్నారు. ఇద్దరూ ఏ బిడ్డ అయితేనేం తమ బిడ్డే కదా! అదే తమకు మగ బిడ్డ. ఆడబిడ్డ. ఆ తేడా లేకుండా పెంచగలిగితే చాలు అన్నది వారిద్దరి ఉమ్మడి నిర్ణయం.

నిజంగా అలా అందరూ అలానే అనుకుంటే ఈ ఆడ, మగ వివక్షతలు ఉంటాయా? వరకట్న సమస్యలు వస్తాయా?

ఆడపిల్ల... ఆ...డ... పిల్ల అని చూడటం ఎంత వరకు సబబు? ఎప్పుడూ మగ పిల్లలను, ఆడపిల్లలను పెంచటంలో తేడా చూపించే తల్లితండ్రులకు అతీతంగా వసంతను పెంచి పెద్ద చేశారు.

అది తమకెప్పుడూ గర్వకారణమైన విషయమే అని మురిసిపోతుంటారు ఆ దంపతులు.

ఏ జంటైనా వారిని అనుసరించాల్సిందే. పిల్లలను అందరూ కంటారు. కానీ అందరికీ ఎలా పెంచాలో తెలియదు.

అది ఈ దంపతుల దగ్గర తెలుసుకుంటే సగం దేశం బాగుపడుతుంది.

* * *

కన్నెగులాబీ సోయగం, రేకుల సున్నితత్వం, వ్యక్తిత్వపు సువాసన... వెరసి వసంత. ఆమె ఆలోచనలలో ఎప్పుడూ పూలు... చెట్లు... పిల్లలు... జంతువులు... ఆ తరువాత మనుషులు... వారి మనస్తత్వాలు. ప్రతి చిన్న విషయానికి కదిలిపోవటం... బాధపడటం... జాలిపడటం... తనకు తోచిన సహాయం చేయటం ఆమె అలవాటు.

"రోజు కొక్కరికైనా సహాయం చెయ్యాలి వసూ!" అని తాతయ్య బ్రతికుండగా చెప్పిన మాటలు అనుక్షణం ఆమె హృదయంలో మానవత్వపు గంటలు మ్రోగిస్తూనే ఉంటాయి.

తన గురించి కంటే ఎదుటివారి గురించి ఎక్కువ ఆలోచించటం ఆ కారణంగా ఎక్కువయింది. అయినా తన గురించి తాను ఆలోచించుకోవల్సిన పనేముంది? అన్నీ తామై, అంతటా తామై వ్యవహరించే తల్లితండ్రులున్నారు.

అలా అమ్మా, నాన్న లేని అనాధలను అక్కున చేర్చుకోగలగటమే తన జీవితాశయం.

తన ఆలోచనలకి తనే నవ్వుకుంది.

కన్నె పిల్లలకు కలల్లో రాజకుమారులు కదా రావల్సింది. అదేమిటో తనెప్పుడూ అలాంటి వాటికి దూరమే!

తనకి ఆరడుగుల అందగాడు కాదు కావల్సింది అందమైన వ్యక్తిత్వం ఉన్నవాడై ఉండాలి. ఆస్థులు కాదు కావల్సింది పెళ్ళి పేరుతో అందుకొన్న తన చేతిని చివరి వరకూ విడనాడకుండా ప్రేమను పంచితే అదే తనకు లక్షలు విలువ చేసే ఆస్థి. అన్నింటికన్నా ముఖ్యంగా తన భావాలకు విలువనిచ్చి అర్థం చేసుకొనే అరుదైన ఆర్ధ్ర హృదయం అతనికుండాలి.

"అలాగే! అలాంటి వాడినే నీకు చూపిముడివేస్తాంలే!" జామ చెట్టు మీద పిచ్చుక సన్నగా కిచకిచలాడింది.

"దీనికి మేము ప్రత్యక్ష సాక్ష్యం" అని మామిడాకులు తమ పైన నిలిచిన వర్షపు చినుకులతో ఒట్టుపెట్టాయి.

బంతి పూలు అవునని తలలాడించాయి.

మందారాలు ఆ వింతకు విచిత్రంగా ఊగాయి.

కనకాంబరాలు నీకు తోడన్నాయి.

చిట్టి చామంతి చిన్న పిల్లలా ప్రక్కన తోటి చామంతిని చూడు చూడమని చెప్పి మరీ చూపించింది. సన్నజాజి, మల్లె తమ నేస్తానికి తమని వీడని సువాసనలా ఆమెను అంటిపెట్టుకొంటామని ఆకుల మధ్య నుంచీ ఎగిరి చెప్పాయి.

వాటన్నింటినీ పేరు పేరునా వరుసగా పలుకరించింది వసంత. నిత్యం వాటితో కబుర్లు ఆడుకోవడం ఓ అందమైన అనుభూతి ఆమెకు.

ఏ రోజైనా సందడిలో పడి మరిచిపోతే ఆ రోజంతా ఏదో లోటు... చెట్లన్నీ వాడిపోయినట్లు... తనపై అలిగినట్లు... ఓహ్... తన ఊహలు తనకే విచిత్రం.

మళ్ళీ వెళ్ళి వాటిని బుజ్జగించి, నీళ్ళు పోసి మురిపించటం... అది తనకీ, తన మనసుకీ మాత్రమే తెలిసిన రహస్యం... అలాంటప్పుడే వాటి అలక తీర్చటానికి తను పాట పాడటం... అవి తల లూపటం... ఆనందాన్ని వ్యక్తం చేయటం... తమ్ముళ్లు, చెల్లెళ్లు లేని తనకు అవే అన్నా చెల్లెళ్లు.

ఆ మాటంటే చాలు జడివానకు ఊగినట్లే ఆకులను ఊపేస్తాయి. గంట నుంచీ బిర్రబిగుసుకొని అసలు ఇవి చెట్లేనా? ఒక్కసారి కూడా ఊగటం లేదే! గాలి లేదే అని అందరూ ఆశ్చర్యపోతున్న సమయంలో "ఏమిటిరా అన్నాయిలూ! చెల్లాయిలూ! ఇలా చేస్తున్నారు?" అంటే చాలు గాలులు నవ్వులు పంచుతాయ్ అవి తన నోటిలో ముత్యాల

పలుకులుగా మారుతాయ్... సరిగమలు సరాగాలుగా, పల్లవి పాటలుగా అల్లనల్లన తరంగాలుగా మారి వాటి నన్నింటినీ మురిపిస్తాయ్.

అవి అలా సంతోషంగా ఊగుతుంటే నేలను వదిలి వాటి మీద ఎక్కి మరీ వాటిని పరామర్శించాలని పిస్తుంది.

అమ్మా, నాన్న లేనప్పుడు ఎన్ని సార్లు మామిడి చెట్టు ఎక్కి దానిపై ఆడుకోలేదు? దాని ముచ్చట్లలో మురిసిపోలేదు?

వాళ్ళు ఉంటే పడిపోతానని ఎక్కనే ఎక్కనివ్వరు. ఒక్కోసారి ఇలా ఎక్కాలనిపించటం... ఇదంతా ఏమైనా పిచ్చి కాదు కదా! అనిపిస్తుంది. తనను తానే ప్రశ్నించుకొనేది.

నిజంగా అది పిచ్చి అయినా తన కదే కావాలి. తనని ఎవరన్నా పిచ్చిదనుకున్నా తనకు ఫర్వాలేదు. తన మనసు తనను పిచ్చిదనకుండా ఉంటే చాలు.

కష్టమొస్తే పైకి 'అయ్యో' అని జాలిపడుతూ, లోపల ముసిముసిగా నవ్వుకునే ఈ లోకులు ఉంటేనేం? పోతేనేం? వారి మధ్యే బ్రతుకుతూ వాళ్ళని పట్టించుకున్నట్లే నటిస్తూ 'ఐ డోంట్ కేర్' అనే టైపులో బ్రతకటమే తన ధ్యేయం ఆ ధ్యేయాన్ని నీళ్ళు పోసి అలా పెంచుతూనే ఉంది.

అది పూలూ, కాయలు కాసేదెప్పుడో అని ఎదురు చూస్తోంది.

* * *

ఉయ్యాల బల్ల మీద కూర్చుని పేపరు చదువుకుంటున్న గాంధీ ఏదో మరిచిపోయిన విషయం అప్పుడే గుర్తు వచ్చినట్లుగా గట్టిగా కేక వేసాడు 'వసంతా' అని చెట్లకు నీళ్ళు పోస్తున్న వసంత పరుగులాంటి నడకతో ఆయన ముందుకు వచ్చి "ఏమిటి నాన్నా అలా అరిచారు?" అంది కంగారుగా!

"ఏం లేదమ్మా వయసు పెరుగుతోందిగా మరుపు ఎక్కువైపోతోంది నీకు చెప్పాల్సిన విషయం ఒకటి ఉంది. మళ్ళీ మరచిపోతానేమోనని... అంతే... ఇలారా... నా దగ్గర కూర్చో" అని ప్రక్కన కూర్చోపెట్టుకున్నాడు.

ఏమైందో అని పని వదిలేసి వచ్చిన అరుంధతి ముసి ముసిగా నవ్వుకుంది వాళ్ళిద్దరి వెనకాల చేరి, ఇక ఆరంభమవుతుంది. నేను చెప్పటం ఎందుకు? ఆ తండ్రీ కూతుర్ల మాటలు మీరే వినండి... నేనయితే వాటిని ఏ మాత్రం సమర్థించను. అయినా ఆ విషయంలో వాళ్ళిద్దరూ నన్నసలు పట్టించుకోరు.

"వసూ! నీకో రెండు సంబంధాలు వచ్చాయిరా! నీకు ఈ రెండింటిలో ఏదో ఒకటి తప్పక కుదురుతుందని నా మనసు చెబుతోంది".

"కట్నం ఇవ్వమని ముందుగా చెప్పారా నాన్నా!" ఆత్రంగా అడిగింది వసంత.

"చెప్పానురా తల్లీ! కట్నం ఇవ్వమనే కాదు మా అమ్మాయి డిగ్రీ చదివిందని డిస్టింక్షన్‌లో పాసయిందని... పాటలు చాలా బాగా పాడుతుందని... జీవితమంతా పాటలు వినే అదృష్టం మీకు కల్గిస్తున్నందుకు మీరే మాకు కన్యాశుల్కం ఇవ్వాలని కూడా" అన్నాడు ప్రేమగా ఆమె తల నిమురుతూ...

"ఏమిటి నాన్నా! ప్రొద్దున్నే జోకులా! మీరు కన్యాశుల్కం ఇచ్చినా తీసుకుంటారా?" అంది బుంగమూతి పెడుతూ.

"ఛ! ఏదో సరదాకి అన్నానురా ఇవ్వను... తీసుకోను... అయినా మా బంగారు బొమ్మను కట్టుకునే అదృష్టం అందరికీ ఉంటుందా...ఈ దేశంలో ఎన్ని కోట్ల జనాభా ఉన్నా ఒక్క చిన్న వాడికేగా నా చిన్నారి ఆణిముత్యం అంకితమయ్యేది"

"నేనదృష్టవంతురాల్ని నాన్నా" అంది ఆయన భుజం మీద తలను వాల్చుతూ వసంత.

ఆమె కళ్లలో కృతజ్ఞతావర్షం.

"ఎందుకురా?" లాలింపుగా తల నిమురుతూ అడిగాడాయన.

"అబ్బాయి నచ్చాడా అని అడగకుండా అవతలివాడు కురూపి అయినా మన అమ్మాయి నచ్చిందంటే చాలు అని కట్టబెట్టే తల్లి తండ్రులున్న ఈ లోకంలో కట్నం కావాలనుకునే అతన్ని చేసుకోను అని చెబితే నాలుగేళ్లుగా నా కోసం మంచి సంబంధాలు రాకపోయినా నన్ను పల్లెత్తు మాట అనకుండా నా ఆశయపు చెట్టుకి నీళ్ళుపోసి బ్రతికిస్తున్నారు. అంతకంటే ఏం కావాలి నాకు?"

ఆయన చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు.

"వసూ! మీ నాన్న ఏం అనరే! చుట్టు ప్రక్కల వాళ్ళే నవ్వుకుంటున్నారు. ఈవిడగారు ముసల్దవుతుంది. కానీ కట్నం లేకుండా ఈ కాలంలో ఎవరు పెళ్ళి చేసుకుంటానికి వస్తారని" అంది వెనుక నుంచీ అరుంధతి.

నిజంగా ఇలాంటివి ఆవిడకు చెప్పాలని ఉండదు. కానీ ఈ నిజాలు తెలిస్తేనన్నా వీళ్ళిద్దరూ మారుతారేమోనని చిన్న ఆశ.

అందరికీ పిల్లలు లేరూ! అందరికీ పెళ్ళిళ్లు చెయ్యటం లేదా! ఉన్న ఒక్క పిల్లకి ఎంతో కొంత ఇవ్వలేమా అన్నది ఆవిడ వాదన.

"అమ్మా! మొదలు పెట్టావూ అనుకోనీవే వాళ్లకు ఖాళీ ఉంది ఏం మాట్లాడాలో తెలియక అందరి గురించి అలా వాగుతూ ఉంటారు. అంతే... రేపు ఎవరన్నా నన్ను కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటే అప్పుడు అలా నవ్వుకున్నందుకు వాళ్ళే సిగ్గుపడతారు. అలా ఎవరూ రాలేదనుకో ఎంచక్కా అమ్మా, నాన్నల దగ్గిరే ఉండిపోతాను. అంత భాగ్యం ఎందరికి ఉంటుంది?"

"బాగా చెప్పావ్! బాగా చెప్పావ్! వన్స్‌మోర్!" అరిచాడు ఆయన సంతోషంగా...

"ఇదుగో దానికి ఇలా మీ వత్తాసు ఉండబట్టే నన్నూ నా మాటలను చీపుర పుల్లల్లా తీసి పారేస్తుంది" అంది చిన్నబుచ్చుకుంటూ.

గబుక్కున తల్లి ప్రక్కన చేరి మెడలో చేతులను దండలుగా వేస్తూ "అలా ఎప్పుడూ అనొద్దమ్మా! నువ్వు మా ఇద్దరి ప్రాణం. ఒకటి గమనించావా! తిట్టడంలో కూడా నీ గొప్పతనాన్ని చాటుకున్నావు."

"ఏమిటి?" తన కినుక విషయం మరచిపోయి ఆశ్చర్యంగా అడిగింది.

"అదే! చీపురపుల్ల అనటం"

అర్థం కానట్లుగా ముఖం పెట్టిన ఆవిడను చూస్తూ "ఆడపిల్లలను అలా చీపుర పుల్లలని తీసి పారేస్తారు కానీ ఆ ఆడపిల్లలంతా ఇలా పుల్లలుగా కలిసి 'చీపుర' లా తయారయి ప్రతి ఇంటినీ శుభ్రం చేస్తేనే మనమింత ఆరోగ్యంగా ఉన్నాం. నన్ను ఈసడిస్తారా అని అవి అలిగాయంటే ఇంటికీ, చెత్త కుండీకీ తేడా ఉండదు. ఆడవారిని గౌరవించడం తెలిస్తే గదా విలువలు తెలిసేది. అర్థమైందా?"

"నా తల్లి!" అని వసంత నుదిటి మీద ముద్దు పెట్టుకుంటూ "నాన్ననే కాదు నన్ను కూడా మాటల్లో మభ్యపెట్టేస్తావే. నువ్వు తప్పు చేస్తున్నావు అని కాదు తల్లీ నీ ఆశయాలను అర్థం చేసుకొనే మనుషులు ఈ ప్రపంచంలో ఉన్నారా అని. జీవితానికి సార్థకతను, పరిపూర్ణతను తెచ్చేది పెళ్ళి. దానికి దూరమై పోతావేమోననే బెంగ నన్నిలా మాట్లాడిస్తుంది."

"నాకు తెలియదామ్మా! నువ్వు బెంగ పెట్టుకోకు నీ ముచ్చట తీర్చే రోజు అతి తొందరలో...టట్టడాం... అంది రేడియోలో వచ్చే అడ్వర్టయిజ్‌మెంట్‌లా ట్యూన్ చేస్తూ... "అయ్యో! మీ మాటల్లో పడితే నాకేం తెలియదు. అవతల కూర మాడిపోయి ఉంటుందని" ఒక్కసారి నడకను పరుగు పందెంగా మార్చిందావిడ.

నవ్వుకున్నారు తండ్రీకూతుళ్లు.

"వివరాలు చెప్పనామ్మా!"

"చెప్పండి నాన్నా!" అంది వినడానికి సిద్ధమవుతూ...

పెళ్ళి అనగానే సిగ్గు పడే తత్వం కాదు తనది. అందులో తండ్రి తనకొక స్నేహితుడు. ఫ్రీగా, పబ్లిక్‌గా చర్చించుకోవడం తమకలవాటు.

ఎందరో ప్రేమించుకొని, పెళ్ళి దగ్గరకు వచ్చేసరికి విఫలమైపోయి కొందరు భగ్న ప్రేమికులవడం, మరి కొందరు మరో అమ్మాయిని పెళ్ళి చేసుకొని హాయిగా కాపురం చేయటం, ఇవన్నీ తనకు నచ్చవు.

ప్రేమ అంటే ఒక్కసారే పుట్టాలి. అది తనతోనే అంతమవ్వాలి. అదే నిజమైన ప్రేమ. అదీ పెళ్ళితోనే ముడిపడాలి.

నిజంగా 'ప్రేమ ఒడి' అంటే పడి చచ్చిపోయే తను ప్రేమలో పడితే ఏమయ్యేదో? కాని "పెళ్ళి చేసుకొని ప్రేమిద్దాం!" అనే సిద్ధాంతాన్ని నమ్ముకున్నందుకు తను ఎవరితోనూ ప్రేమలో పడక పోవడం హాయిగా అనిపిస్తుంది.

ఏదయినా మన చేతిలో ఉందా?

అది ఏ క్షణంలోనన్నా మనతో స్నేహం కట్టి, మనల్ని మనంగా ఉంచని ప్రేమను కాదనే శక్తి ఎవరికయినా ఉందా?

నిజంగా తనకలా జరిగినా ఆ విషయాన్ని మొదటిసారిగా పంచుకొనేది తన తండ్రితోనే!

"ఏవిటమ్మా! నన్ను చెప్పమని ఆలోచనల్లో పడ్డావ్?"

"ఆలోచనలు అని మీరే అన్నారుగా... అవి ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు మనల్ని వదిలి వెళతాయో మనమే చెప్పలేం అని మీరు చెప్పిందేగా... అంతే! చెప్పండి... చెప్పండి...

మొదటి అబ్బాయి పేరు 'అనురాగ్'.

అబ్బాయిని చూశాను. అందగాడు, బుద్ధిమంతుడు, ఏ చెడ్డ అలవాట్లూ లేనివాడు. నలుగురు తమ్ముళ్లు, ఒక అక్క, ఒక చెల్లి. బరువు బాధ్యతలు ఎక్కువ. అయినా అన్నింటినీ సర్దుకోగల సమర్థత ఉన్నవాడు అనిపించింది. వయసు ముప్పై. డిగ్రీ డిస్కంటిన్యూ చేసాడు. గవర్నమెంట్ స్కూల్‌లో క్లర్క్‌గా చేస్తున్నాడు."

'అనురాగ్' పేరు బాగుంది కదు నాన్నా!

"పేరే కాదు మనిషి కూడా బాగున్నాడు" అన్నాడాయన.

"ఇక రెండవది అతని పేరు 'సూర్యకిరణ్'.

ఇంజనీరు. లక్షల ఆస్థి ఉంది. ఒక్కడే పిల్లవాడు. పెద్ద బంగ్లా ఉంది. ఇతనూ బాగున్నాడు. బాదర బందీలు లేవు. బాగా సంపాదిస్తున్నాడు"

ఇంకా ఏదో చెప్పబోతూ ఉండగానే అడ్డుతగులుతూ "సంపాదన అంటే లంచాలా నాన్నా?" అడిగింది.

"అయి ఉండవచ్చమ్మా! లంచాలు తీసుకోని వాడు నూటికి ఒకడు ఉంటాడు. అది నేను పూర్తిగా కనుక్కోలేదు. ఇన్నాళ్లకు నా కూతురికి వచ్చిన మంచి సంబంధాలు. నీకు వాళ్లు నచ్చాక, వాళ్లకి నువ్వు నచ్చాక పూర్తిగా వాళ్ల స్వభావాలు తెలుసుకుంటే కానీ వాళ్ళ చేతుల్లో నా పసిపాపను పెడతానా?"

'నా...న్నా...' అంది.

ఆ రెండు మాటల్లో ఎంతో ఆప్యాయత.

ఇలాంటి తండ్రి ఇంకెవరికీ ఉండరేమో! ఇలా ఎన్నిసార్లు అనుకుంటుంది లైఫ్‌లో. ఎన్నిసార్లయినా వేలు... కోట్లయినా బోరు కొట్టని మాట ఉందంటే అదే ఇది.

"రేపు పదిగంటలకు అనురాగ్ వాళ్ళు వస్తారు. రెండు గంటలకు సూర్యకిరణ్ వాళ్ళు వస్తారు. అమ్మకు చెప్పి ఇద్దరూ కలిసి వాళ్ళ అతిథి మర్యాదల సంగతి చూస్కోండి. నేనలా బజారుకి వెళ్ళి వస్తాను. పండ్లవీ కావాలిగా."

"మీకెందుకు నాన్నా శ్రమ. సాయంత్రం అలా షికారుకు వెళ్ళి నేను తీసుకువస్తాలెండి. ఇంకేమైనా పనులు ఉంటే చూసుకోండి. బజారు పన్లన్నీ నావేనని ఎన్ని సార్లు చెప్పాలి?"

"కాదంటే నీకు కోపం వస్తుంది కాబట్టి ఆ పని నువ్వు చూసుకో.అలా వెళ్ళి పరంధామయ్యను కూడా రేపు రమ్మని పిలుస్తాను. కాస్త పెద్దరికంగా ఉంటాడు."

"అలాగే! అమ్మతో ఈ విషయం చెబుతాను" అంటూ ఆయనను పంపి తలుపు వేసి వంటింట్లో తల్లి దగ్గరకు వెళ్ళింది.

అంతా విన్న ఆవిడ "పోనీలే తల్లీ! నీకీ సంబంధమన్నా కుదిరితే అంతకన్నా కావల్సిందేముంది. తిరుపతిలో నీ పెళ్ళి చేస్తానని ఇప్పుడే మొక్కేస్తున్నా!"

"నీ ఇష్టం" తన పొడువాటి జడ చివర్లను రింగులు రింగులుగా చుడుతూ ఒప్పుకుంటున్నట్లుగా తలను ఊపింది.

తన మనసు కూడా వింత వింతగా ప్రవర్తిస్తోంది. ఇలా ఎప్పుడూ లేదే!?

* * *

సమయం పదిగంటలు.

"అరుంధతీ! వసూ కనిపించదేం?"

"అనుకున్నంత అవుతోంది. ప్రక్కింట్లో ప్రశాంతికి నొప్పులొచ్చాయ్. ఇంట్లో మగవాళ్లు లేరు. సాయంగా ఆసుపత్రి దాకా వెళతానంది. అప్పటికీ వద్దని మొత్తుకుంటూనే ఉన్నాను. నామాట వింటుందా?"

"పాపం అమ్మా! టైముకు వచ్చేస్తాగా" అంటూ వెళ్ళిపోయింది.

"ఇది చిన్నప్పటి నుంచీ ఉన్నదేగా! ఎదుటి వారికి ఏ ఆపద వచ్చినా తనకే వచ్చినంతలా మాట్లాడటం... సాయం చేసే వరకూ నిద్రపోక పోవడం..."

"సరే...సరే... ఆపుతావా నీ దండకం. 'ప్రార్థించే పెదవుల కన్నా సహాయపడే చేతులు మిన్న' అన్నారు. అలా అది చేసేవి అన్నీ మంచి పనులే! మదర్‌థెరీసా అంత మంచి హృదయం నా కన్నది. వచ్చేస్తుందిలే. ఈ నాన్నకు మాట వచ్చే పనులు ఏమీ చెయ్యదు. ఆ నమ్మకం నాకు ఉంది. నువ్వు కంగారు పడి నన్ను కంగారు పెట్టకు" అంటూ పేపరు చదవడంలో నిమగ్నమయ్యారు.

"ఇది నాకు మామూలే కదా!" అనుకుంటూ ఆవిడ లోపలికి వెళ్ళింది.

ఇంతలో ఆటో ఆగిన శబ్దమయింది.

గబ గబా ఎదురు వెళ్ళారాయన

"రండి...రండీ..." అంటూ ఆహ్వానించాడు చిరునవ్వును జోడిస్తూ...

పెళ్ళికొడుకు, అతని తల్లీ, తండ్రి వారితో ఒక చిన్న పాప. ముగ్గురు రాకూడదని సెంటిమెంట్ కాబోలు.

"అరుంధతీ! వాళ్ళు వచ్చేశారు" అన్నాడు లోపలికి వినిపించేటట్లు.

"అబ్బా! దగ్గరకు వచ్చి చెప్పవచ్చుగా ఇన్నేళ్ళు వచ్చినా అన్నీ చెప్పాల్సిందే!" విసుక్కుందావిడ మనసులోనే.

"కాళ్ళు కడుక్కోండి" అంటూ వాళ్ళందరికీ నీళ్ళు ఇచ్చి, తుడుచుకోవటానికి టవల్స్ అందించి, లోపలికి వెళ్ళి అందరికీ మంచి నీళ్ళు తెచ్చి ఇచ్చింది.

అప్పుడు హడావిడిగా లోపలికి వచ్చాడు పరంధామయ్య.

"గాంధీ! అర్జంట్ పని పడి కాస్త ఆలస్యమయింది క్షమించరా!" అన్నాడు పరంధామయ్య.

"ఫర్వాలేదులే కానీ అమ్మాయే రాలేదు. హాస్పిటల్‌కి వెళ్ళిందట"

"వచ్చేస్తుందిలే! టిఫిన్లు, టీలు ఇస్తే సరి. నే మాటల్లో పెడతానుగా భయపడకు" అంటూ వెళ్ళి సోఫాలో వారి ఎదురుగా కూర్చున్నాడు. పరిచయాల కార్యక్రమం ప్రారంభమయింది.

"నా చిన్ననాటి స్నేహితుడు" అన్నాడు గాంధీ పరంధామయ్యను చూపిస్తూ

"అందరికీ నమస్కారం" అన్నాడు పరంధామయ్య

"వీరి పేరు అనురాగ్, వాళ్ల నాన్నగారు కరుణానిధి, అమ్మగారు అమృతవల్లి. మరి ఈ పాప..." అని సందిగ్ధంగా ఆగిపోయాడు.

"మా అక్కగారి పాప పేరు 'శిఖర" అన్నాడు అనురాగ్

గాంధీ ప్రేక్షకుడిలా కూర్చున్నా పరంధామయ్య ఎవర్నీ వదల్లేదు. ముఖ్యంగా పెళ్లికొడుకును. కాసేపటిలో అతను ఏ స్కూల్లో ఎప్పుడు చదివాడో దగ్గరనుంచీ కాలేజీ వరకూ ఏదీ మరచిపోకుండా ప్రశ్నల వర్షం కురిపించాడు.

మాష్టారు దగ్గర స్టూడెంట్‌లా సమాధానాలు చెబుతున్న అనురాగ్‌ని చూసి మనసులోనే మెచ్చుకున్నాడు గాంధీ.

పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా లోపల బెరుకుగానే వుంది ఆయనకు వసంత ఇంకా రాలేదని.

"అరుంధతీ! అలసిపోయి వచ్చారు. ముందు టిఫిన్లు తీసుకురా" అన్నారు.

వెంటనే ఆవిడ లోపలికి వెళ్ళి అందరికీ టిఫిన్లను ప్లేటులో సర్ది అందించింది.

వసంత ఉంటే ఆమె చేతనే ఇప్పించేది.

ఈ ఒక్కరోజు బయటకు వెళ్ళకపోతే ఏం?

ఇది వెళ్ళకపోతే వాళ్లకి పిల్లాడు పుట్టడా? ఇంకెవరూ తీసుకెళ్ళరా?

అన్నింటికీ నేనున్నానంటూ తగుదునమ్మా అని తయారు.

పైకి చిరునవ్వు నవ్వుతూనే మనసులో మళ్ళీ మళ్ళీ తిట్టుకొంటోంది కూతురిని.

ఎక్కడికి వెళితే అక్కడే. పది గంటలకు పెళ్ళి చూపులని తెలుసు. పదకొండయ్యింది. ఇప్పటికైనా రావాలని జ్ఞానం లేదు. ఆవిడ టెన్షన్ ఆవిడది. పెళ్ళి కావల్సిన పిల్ల బయట తిరగడాలు ఏమిటని ఎక్కడ వాళ్ళు అనుకుంటారో అని.

నిజంగా వాళ్ళింట్లో పిల్లలు అసలు బయటకు వెళ్లరా ఏమిటి? ఏదో పెళ్ళి చూపులప్పుడని... కంగారుపడటమే కానీ...

ఇంతలో హడావిడిగా ఎవరో వస్తున్న చప్పుడు....

ఎదురువెళ్ళేలోపే చెప్పులు విడవటం లోపలికి వసంత రావటం జరిగిపోయింది.

అరుంధతి ఒక్క క్షణం విస్తుపోయింది. ఆవిడ పెరటివైపు ఆమెను తీసుకువెళ్ళి కాస్త ముస్తాబు చేసి తీసుకు వద్దామనుకుంది. దీనికంతా దూకుడే!

"సారీ! నాన్నగారూ! కాస్త ఆలస్యమైంది" అంటూ వెళ్ళి తండ్రి ప్రక్కన కూర్చుంది.

"ప్రక్కింటి వాళ్ళమ్మాయికి పురుడు వచ్చింది. సాయం రమ్మంటే వెళ్ళింది. మా అమ్మాయి వసంత" అని పరిచయం చేశాడు గాంధీ.

అందరికీ లేచి నమస్కారం చేసింది.

స్వేదంతో నిండిన ఆమె ముఖం వర్షానికి తడిసిన గులాబీలా వుంది.

గులాబీరంగు చీరలో, అదే రంగు మ్యాచింగ్ జాకెట్టుతో, మెడలో బంగారు గొలుసుతో సింపుల్‌గా వున్నా తోటలో గులాబీలా ముద్దుగా వుంది.

అందమైన తోటలో ఎన్నో రకాల పువ్వులు కనువిందు చేస్తాయి. కానీ ఏ పూలకు గులాబీ అందం రాదు. ఎవరు అన్నా అనకపోయినా, చెప్పినా చెప్పకపోయినా గులాబీ అందం గులాబీదే.

అలా వున్న వసంతను అందరూ అలా చూస్తున్నారు.

అనురాగ్ అయితే రెప్పవేయటం మరిచాడు. ఆ బ్రహ్మ ప్రపంచంలోకెల్లా అత్యంత అద్భుతంగా వుండే అందాలరాశిని వసంత రూపంలో తన కోసం ప్రత్యేకంగా తయారుచేసి పంపాడా అని సందేహం వచ్చింది.

అది గమనించిన ఆమె పెదాల మీద చిన్న చిరునవ్వు తళుక్కున మెరుపులా మెరిసి మాయమయ్యింది.

"మీరేమయినా అడగాలని వుంటే అమ్మాయినడగండి" అన్నాడు గాంధీ.

"మేమేం అడగక్కర్లేదు. అదంతా అబ్బాయి, అమ్మాయి చూసుకుంటారు" అంది అమృతవల్లి.

'పెళ్ళి కొడుకు తల్లి హోదాలో వున్నా కించిత్ గర్వం కూడా లేదు. డబ్బు వున్నా, లేకున్నా పెళ్ళి చూపులకి వెళుతున్నామంటే చాలు పెళ్ళికొడుకు తల్లి దేశానికి మహారాణి అన్నంతలా ఫీల్ అవటం తనెన్నిసార్లు చూడలేదూ!' అనుకొంది వసంత.

"అలాగంటారేమిటి? మీ కూతురు మెట్టినింటికి వెళ్ళిపోతే ఆ స్థానాన్ని భర్తీ చెయ్యవలసిన కోడలు మీకు సరిపోతుందో లేదో తెలుసుకోవాలిగా" అంది వసంత.

"చాలమ్మా! నువ్వన్న ఒక్కమాట చాలు. అందులో వేయి అర్థాలు"

ఆ అమ్మాయి అలా అడిగిందనటానికి విస్మయం ప్రకటించటానికి బదులు ఆమె కలుపుగోలుతనానికి ముచ్చటపడ్డారా దంపతులు.

కాసేపు పెరటిలోకి వెళ్ళి మాట్లాడుకోండి" అని ఆ జంటకి పర్మిషన్ ఇచ్చారు.

అనురాగ్, వసంత ఒకరి వెనుక ఒకరు నడిచారు.

అతను ఉసిరిచెట్టుకు ఆనుకొని నిలబడుతూ...

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Prema+Vasantam**

* * *